# భయం

హైదరాబాదు నగరం—

ఆ నగరంలో ఒక ప్రభుత్వ ఆఫీసు. ఆ ఆఫీసులో ఓ కుర్చీ. ఆ కుర్చీలో ఒక గుమాస్తా. ఆ గుమాస్తా గుర్తింపు హాజరుపట్టీలో "డి-టూ."

అతడి పేరు గణపతిరావు.

ఆ పేరు వినగానే పొట్టిగా, బొద్దుగా, చిరుబొజ్జతో ఉండే ఆకారం కళ్ళల్లో మెదులుతుంది. అతడు నిజంగా అలా ఉండివుంటే ఈ కథ చెప్పాల్సిన పనే ఉండదు.

ఆరడుగుల నాలుగంగుళాల వెదురుబద్దను నిలబెట్టి, రెండున్నర అడుగుల మరో వెదురుబద్దను, ఆ బద్దకు రెండడుగుల అరంగుళాల కిందగా కట్టి, పైన ఒక రాగి బుడ్డిచెంబును బోర్లించి, వదులొదులుగా బట్టలు తొడిగి చూడండి—అచ్చగా అలాగే ఉంటాడు గణపతిరావు.

కత్తితో గీరిగీసి చూసినా ఎముకలకూ, చర్మానికీ మధ్య మరో పదార్థం కనిపించదన్నట్టుగా ఉంటాడు.

అతడికి జనంలోకి వెళ్ళాలంటే భయం.

జనాన్ని తోసుకుని బస్సెక్కాలంటే భయం.

జనంలో ఎవరి మోచెయ్యి అయినా తగిలితే ప్రాణం కడబట్టినట్టు అవుతుంది.

వెధవలకు తనంటే అలుసు. కావాలనే మోచేత్తో పొడుస్తారు. ఎదురుగా వస్తూ కావాలనే డాష్ ఇస్తారు. తను ఎప్పుడూ ఇలాగే ఉంటాడా ఏం? ఒకనాడు తనూ వళ్ళు చేస్తాడు. తన ఒడ్డూ పొడవూ చూసి జనం భయపడి తప్పుకుపోతారు. ఆ రోజు తప్పక వస్తుంది. ఇలా సాగిపోతుంటాయి అతడి ఆలోచనలు, జనం తగ్గేదాకా బస్ కోసం బస్ స్టాండులో నిల్చున్నప్పుడు.

చిన్నప్పుడు స్కూల్లో పిల్లలకి అతడంటే సర్దాగా ఉండేది. వెనకనుంచో, ఎదురుగా వచ్చో చూడనట్టు తోసేవాళ్ళు. ఏ కాలు ఎముకో చేతి ఎముకో విరగ్గొట్టుకొని ఇంటికి ఏడుస్తూ వచ్చేవాడు. చిన్నతనం కావడంవల్ల విరిగిన ఎముకలు త్వరగానే అతుక్కునేవి.

స్కూల్లో తోటిపిల్లలతో ఆడుకోవాలని ఉండేది. కాని భయం అతడి కోర్కెను వెనక్కు నెట్టేది. ఎవరితోనూ మాట్లాడేవాడుకాదు. తనను ఎవరైనా నిక్ నేమ్స్‌తో

పిల్చినా వినిపించుకోనట్టే ఉండిపోయేవాడు. తగాదాకు దిగితే ఏమవుతుందో గణపతిరావుకు తెలుసు.

"సన్నాసి. తినేదంతా ఏమవుతుందో?" ఎముక విరిగి నప్పుడల్లా తండ్రి విసుక్కునేవాడు.

'పిచ్చి సన్నాసి ఎలా బతుకుతాడో?' తల్లి బాధపడేది.

చిన్నతనంలో తల్లిదగ్గర పడుకోవాలని ఉండేది గణపతి రావుకు. అతడు మారాం చేస్తే 'వద్దురా నాయనా! నీ ఎము కల గూడు తగిల్తే నా ప్రాణం పోతోంది' అనేది తల్లి. గణపతిరావుకు తల్లి మాటలకు దుఃఖం వచ్చేది. దుఃఖం పైకి రాకుండా గొంతు అణచిపెట్టుకొనేవాడు. చివరకు అమ్మాన్నా, నాన్నంటే కూడా భయం ఏర్పడింది. వాళ్ళతో మాట్లాడే వాడు కాదు. అడిగినదానికి ముక్తసరిగా జవాబిచ్చేవాడు. 'నంగివెధవ! అవతారానికి తగ్గట్టు మాట కూడా పోతున్న ట్టుంది' తండ్రి విసుగ్గా అనేవాడు. గణపతి మనసు చివుక్కు మనేది. తండ్రిని వంగదీసి గభీ గభీమని వీపు వాయించా లనిపించేది. కాని ఎలా? తండ్రంటే చచ్చేంత భయం.

ఆ భయం అరచేతి మందాన అతడి అర్థచేతన మనసులో గూడుకట్టుకొని ఉండిపోయింది! వయసుతోపాటు ఆ భయం పెరిగిపోయింది. న్యాయంగా చెప్పాలంటే వయసుకంటే కూడా ఆ భయం ఏపుగా పెరిగింది.

ఊళ్ళోవున్న స్కూల్లో చదివి స్కూల్ ఫైనల్ పాసయ్యాడు. కాలేజీకి వెళతానన్నాడు. తండ్రి ప్రొద్ధు

లంతో ఉద్యోగంలో చేరాడు. ఒక మహారాష్ట్రుల ఇంట్లో పేయింగ్ గెస్టుగా ఉంటున్నాడు. ఎక్కువ పే చేసి ప్రత్యేకంగా ఒకగది తీసుకున్నాడు. ఆ ఇంటి ఇల్లాలుకు మిగతా ఇద్దరు కుర్రాళ్ళకంటే గణపతి అంటే ఇష్టం. అతడు ఏదీ డిమాండ్ చేసేవాడు కాదు. ఏది పెడితే అదే మానంగా తినేసి వెళ్ళిపోయేవాడు. పైగా అతడివల్ల ఎలాంటి చిరాకు ఇంటివాళ్ళకు ఉండేదికాదు. అతడికోసం ఎవరూ రారు. అతడు ఆపీసు వదిలాక తిన్నగా ఇంటికి వచ్చేస్తాడు. ఏ రెండో ఆట సినిమాకో వెళ్ళి ఏ అర్ధరాత్రో తలుపుకొట్టే న్యూసెన్సు అతడివల్ల ఉండదు.

అందుకే అతడంటే ఆమెకు ఇష్టం. బాగానే పెట్టేది. అయినా మనిషి గుప్పెడు కండ పట్టేవాడు కాదు. తెగ ఆశ్చర్యపడిపోయేది ఆ ఇల్లాలు.

గణపతిరావును ఆఫీసులోవాళ్ళు కూడా చులకనగా చూసేవాళ్ళు. అతడ్ని ఏడిపించడం వాళ్ళకు సర్దాగా ఉండేది. ఎటెండర్ని మాట వినేవాళ్ళు కాదు. వాళ్ళమీద గణపతిరావుకు కోపంగా ఉండేది. కసికసిగా ఉండేది. కాని ఏం చెయ్యగలడు. అతను అర్భకుడు.

తనకూ వాళ్ళను ఏడ్పించేరోజు వస్తుందిలే అనుకుంటూ బాధపడుతున్న మనసును జోకొట్టేవాడు.

తనకు బాగా వళ్ళు వచ్చినట్టూ, ఇంతెత్తున తను వస్తాదులా ఉన్నట్టూ, తనసుచూసి ఆఫీసులోవాళ్ళు భయంతో

బిగిసిపోయినట్టూ, ఎవరెందర్నో ఎదురెదురుగా తనపనులు పకుగులుతీస్తూ చేస్తున్నట్టూ కలలు వచ్చేవి గణపతిరావుకు. కవ్వించి ఎవడ్నో కొడుతుండగా అతడికి మెలకువ వచ్చేది. తనమీద తనకే కోపం వచ్చేది. తన శరీరాన్ని తడిమి చూసుకునేవాడు. ఎముకలు చేతికి తగలగానే తనమీద తనకే కోపం వచ్చేది. అంతలోనే జాలి వేసేది. ఆ కలే మరికొంతసేపు ఉంటే బాగుండేదనిపించేది.

రకరకాల అడ్వర్‌టైజుమెంట్లు చూసి టానిక్కులు తెప్పించుకుని తాగేవాడు. ఫారెక్సు బేబీని చూసి చిన్నప్పుడు తనకు ఫారెక్సు పెట్టనందుకు తల్లిని తిట్టుకొనేవాడు.

ఒకసారి ధైర్యంచేసి డాక్టరుదగ్గరకెళ్ళాడు. డాక్టర్ జాలిగా చూస్తూ టానిక్కులు లాభంలేదు. ముప్ఫయ్ ఏళ్ళు దాటాక దానంతటదే వళ్ళు వస్తుందిలే అని చెప్పాడు. డాక్టర్ను తిట్టుకుంటూ ఇంటికి వచ్చాడు.

గణపతిరావు వయసు ఇరవైఏడు ఏండ్లు. మరో మూడు నాలుగేళ్ళు! నిట్టూర్చాడు గణపతిరావు.

ఒకరోజు ఆఫీసుకు వస్తుండగా ఓ పొడవాటి కుర్రాడు తోలుకోటు వేసుకొని కన్పించాడు. ఆ కుర్రాడు బక్కగా ఉన్నాడు. అయినా ఆ కోటులో బొద్దుగా ఉన్నట్టే కన్పించాడు.

ఆ సాయంత్రమే అబిడ్స్‌కు వెళ్ళాడు. బజారంతా గాలించాడు. ఒక షాప్‌లో తనకు కావాల్సిన తోలుకోటు

కన్పించింది. వెంటనే బేరంకూడా చేయకుండా, ఆలస్యం అయితే మరెవరైనా ఆ కోటుకోసం వస్తారన్నట్టుగా, కోటు కొనుక్కొని బయటకు వచ్చాడు.

ఒక పెద్ద అద్దంకూడా కొన్నాడు.

ఆటో దిగి గబగబ పైకి వెళ్ళాడు.

"ఏంటి బాబూ! ఏదో కొన్నట్టున్నావ్?" ఇంటి ఇల్లాలు వరండాలో నిల్చుని ప్రశ్నించింది.

విన్పించుకోనట్టు వెళ్ళిపోయాడు. కోటువిప్పి వేసుకున్నాడు. గుండీలకు బదులు జిప్ ఉంది. గొంతుదాకా జిప్ లాగాడు. అద్దంలో చూసుకున్నాడు. అతడి కళ్ళు మిలమిలలాడాయి. అతడికి, తనలోకి ఏదో కొత్త శక్తి ప్రవేశించినట్టుగా అన్పించింది. ఆ రాత్రంతా ఎన్నెన్నో కలలు! అన్నీ కోటుగురించే.

తెల్లవారి ఆఫీసుకు తయారయ్యాడు. రెండు బనీన్లు వేసుకుని, దానిమీద ఉలెన్ స్వెట్టర్ వేసి ఆ పైన షర్టు వేసుకొన్నాడు. అద్దం ముందు నిల్చుని లెదర్ కోటు వేసుకొన్నాడు. సంతోషంతో వళ్ళుబ్బిపోయింది.

ఆఫీసుకు బయలుదేరాడు. జనంలో నడవడానికి భయం అన్పించలేదు. నిటారుగా నడుస్తున్నాడు. ఎదురు వచ్చే వాళ్ళు కళ్ళు పెద్దవి చేసుకొని అతడ్ని చూస్తున్నారు! వాళ్ళలా చూస్తుంటే అతనికి సంతోషంగా ఉంది. గర్వంగా ఉంది. గొప్పగా ఉంది.

ఎదురుగా వస్తున్నాడు ఓ లావుపాటి యువకుడు ఆతడ్ని చూశాడు గణపతిరావు.

"రా! రా! నాకు డాష్ ఇవ్వడానికి వస్తున్నావా? రా? నేనేం భయపడటం లేదు" మనసులో అనుకుంటూ నిటారుగా పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఆ యువకుడికి ఎదురుగా వెళ్ళాడు. ఆ యువకుడు గణపతిరావును ఆశ్చర్యంగా చూసి పక్కకు తప్పుకుని ముందుకు వెళ్ళిపోయాడు.

గణపతిరావుకు పెద్దగా నవ్వాలనిపించింది. పగలబడి నవ్వాలనిపించింది. "బుజ్జినాయనా? మరి నన్నేమను కున్నావో? పూర్వపు గణపతిరావు అనుకున్నావు కదూ?" మనసులోనే అనుకొని ముసిముసిగా నవ్వుకున్నాడు.

బస్ స్టాండ్‌లో నిల్చున్నాడు. జనంతో కిటకిటలాడు తున్న బస్ ఎక్కాడు. బస్‌లోని వాళ్ళంతా ఆతడిని ఆశ్చర్యంగా చూడటం చూసి గణపతిరావు తనలో తనే గర్వంగా నవ్వుకున్నాడు.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ, ఆఫీసువాళ్ళందర్నీ కలియజూస్తూ ఆఫీసులోకి ప్రవేశించాడు గణపతిరావు.

అందరూ అతడ్ని తాము చేస్తున్నపని మర్చిపోయి కళ్ళప్పగించి చూశారు.

సీటులో నిటారుగా కూర్చున్నాడు.

సూపర్నెంటు కేసి నిర్లక్ష్యంగా చూశాడు.

సూపరెన్టెంటు తెరచిన నోరు ముయ్యడం మర్చిపోయి చూస్తున్నాడు. గణపతిరావు చిరునవ్వు నవ్వాడు.

రోగ్స్? తననుచూసి భయంతో బిగుసుకుపోయారు. ఇంతకాలం తనను భయపెట్టారు. తనను ఒక జైంటును చూసినట్టు చూస్తున్నారు ఇప్పుడు.

చూడరు మరి? తన రూపం మారింది. తన నడక మారింది. తన చూపులు మారాయి. తనిప్పుడా పిరికి గణపతిరావు కాదు.

"పోచయ్యా?" అతడికంఠం అతనికే ఆశ్చర్యాన్ని కలిగించింది, తన కంఠం ఇలా ఎప్పుడైనా ఖంగున మోగిందా?

ఎటెండరు పరుగున వచ్చాడు.

"మంచినీళ్ళు..." అతడిమాట పూర్తి కాకుండానే మంచినీళ్ళకోసం ఎటెండరు పరుగుతీశాడు.

అలా రారా పోచిగాడా దారికి? పరుగులు తీస్తున్నావా? తియ్! తియ్! ఎవడికోసం తీస్తావ్? లేకపోతే నువ్వెంత? నీ బతుకెంత? నా మాటంటే లెఖ్ఖలేకుండా చూశావు గదూ ఇంతకాలం.

పోచయ్య అందించిన గ్లాసునీళ్ళూ గటగట తాగేశాడు. ఖాళీగ్లాసు అందుకున్నాడు, అంతవరకూ కళ్ళప్పగించి అతడ్నే చూస్తున్న ఎటెండర్ పోచయ్య. 'ఏం సార్ ఒంట్లో బాగాలేదా?' అడిగాడు.

'నాకేం? చాలా బాగున్నాను.'

అప్పుడు తెలిసింది గణపతిరావుకు తోలుకోటుకింద వళ్ళు మండిపోతున్నట్టు.

"అదేమిటోయ్! చలికాలం పోతుంటే ఇప్పుడు తోలు కోటు వేసుకున్నావేం?" అడిగాడు శేఖర్.

'ఆఫీసులోనైనా తీసి అవతల పెట్టొచ్చుగా?' అన్నాడు శంకర్రావు.

'అమ్మ శంకర్రావూ? నీ ఎత్తు నాకు తెలియదనుకున్నావా? కోటు తీసి పక్కన పెడ్తే ఏ బాత్‌రూంకో వెళ్ళినప్పుడు కోటు దాచేసి నన్ను ఏడిపించాలని చూస్తున్నావు గదూ? అసలు సంగతి ఈ కోట్లో నన్ను చూస్తుంటే నీకు భయం వేస్తోంది. అందుకే...' మనసులోనే అనుకున్నాడు గణపతిరావు.

సమాధానంగా, గంభీరంగా నవ్వాడు. అతడినవ్వు అతడికే హుందాగా అన్పించి తను ఇంత గొప్పగా నవ్వగలడా అని ఆశ్చర్యపోయాడు.

గణపతిరావుకు లోపల ఉడికిపోతున్నది. కోటు తీసి దూరంగా పడెయ్యాలనిపిస్తోంది. లోపల బనీన్లూ, షర్టు చెమటతో తడిసిపోయాయి.

తీసేస్తే ఇంకేమయినా ఉందా? మళ్ళీ ఈ ఇమేజ్ పోదూ? క్రమంగా అదే అలవాటవుతుంది.

ఎంత ప్రయత్నించినా ఈ ఉడుకు భరించ లేక పోతున్నాడు. అర్ధరోజు శెలవుపెట్టి ఇంటికి బయలుదేరాడు.

గదిలోకి వెళ్ళి అద్దంముందు నిల్చున్నాడు. ప్రతి బింబాన్ని చూస్తూ పలకరింపుగా నవ్వాడు.

"చూశావా గణపతీ! కాదు! కాదు! గణపతిరావు గారూ? ఇవ్వాళ నిన్ను చూసి అందరూ భయపడిపోయారు. ఎప్పుడు లీవు పెట్టినా సవాలక్ష ప్రశ్నలువేసే ఆ సూపర్నెంటు గాడు, ఈ రోజు కిక్కురుమనకుండా సంతకం పెట్టాడు. నువ్వు ఎదురుగా ఉంటే వాడికి గుండె దడగా ఉంది."

అద్దం ఎదురుగా నిలబడి ఎంతోసేపు మాట్లాడాడు.

గణపతిరావుకు ఆఫీసులో అందరూ తన కోటు కొట్టెయ్య డానికి కుట్ర చేస్తున్నట్టుగా అన్పించసాగింది. ఆ భావం రోజురోజుకూ బలపడుతూనే ఉంది.

"రాస్కెల్స్! గుసగుసలాడుతూ ఉంటారు! మీ కుట్ర నేను పసిగట్టలేదనుకున్నారా? నేనంత పిచ్చివాణ్ణేం కాదు. మీ వేషాలన్నీ చూస్తూనే ఉన్నా. నా కోటు మీకు చిక్కనిస్తనా మీరు ఎన్ని ఎత్తులు వేసినా లాభంలేదు."

ఫైలు చూస్తూ, తనలోతనే అనుకుంటూ, ఆఫీసులో వాళ్ళను ఓరగా చూస్తాడు గణపతి.

"కోల్డువార్, కోటు వార్! ఒకరోజు తప్పదు. డిష్యుం! డిష్యుం అంతవరకూ తప్పదు వీళ్ళనూ, వీళ్ళ

ప్లానునూ ఒకకంట కనిపెట్టి ఉండాలి. పోరాటం తప్పదు! ఎవ్వడా నా ఎదురుగా నిలబడి చెయ్యెత్తగలడు!"

అనుకుంటూ ముసిముసిగా నవ్వుకుంటాడు.

ఇంటివారి అబ్బాయి ఆదిత్య ఆ కోటు గురించి అనేక ప్రశ్నలు వేశాడు. తన కోటుమీద వాడికన్ను పడిం దనుకుని అతడిని తప్పించుకు తిరుగుతున్నాడు గణపతిరావు.

ఆఫీసువాళ్ళతో ఒకసారి యుద్ధానికి దిగక తప్పదు. తను సిద్ధంగా ఉండాలి.

గణపతిరావు అద్దంముందు నిలబడి ప్రాక్టీసు చెయ్య సాగాడు. అందుకోసం రెండు మూడు సూపర్ హీరోలు యాక్ట్ చేసిన సినిమాలు మూడు నాలుగుసార్లు చూశాడు. ఆ పట్టులూ, ఎగరడాలూ జాగ్రత్తగా పరిశీలించి చూశాడు.

గతంలో శేఖరో, రాజో, గణపతిని ఆటలు పట్టించే వాళ్ళు. వాళ్ళంటే అతడికి కసి. ఇప్పుడు వాళ్ళు అతడ్ని జాలిగా చూస్తారు. కాని గణపతికి వారి చూపుల్లో భయం కన్పించేది. సంతృప్తిగా తల పంకిస్తూ నవ్వుకునేవాడు.

ఒకరోజు వాళ్ళిద్దరూ లోపల తోలు బనీన్లు వేసు కున్నట్లు అన్పించింది.

"ఒరే! రాస్కెల్స్! మీ కుట్రను నేను తెలుసుకో లేననుకున్నారా? నన్నే మోసం చేస్తారా? నా కళ్ళు ఎక్సరే కళ్ళురా! లోపల వేసుకున్నా నాకళ్ళు చూడగలవు.

"ఒరేయ్ రాజూ! శేఖర్! నాకు తెలుసురా మీకు నేనంటే చచ్చేంత భయం పట్టుకుందని! నా మీద యుద్ధానికి తయారవుతున్నారట్రా! పొట్టి వెధవల్లారా! లిల్లీపుట్స్‌ల్లా మీరు మీ అవతారాలూ, ఆముదం ముఖాలూ మీరూ! నా జోలికొచ్చారా చచ్చారే?"

వాళ్ళను చూస్తూ అనుకొనేవాడు గణపతి.

తను హీరో అయిపోయాడు. అందుకే వాళ్ళు తననే అనుకరిస్తున్నారు.

బోడిగాళ్ళు ఎంత అనుకరించినా తను తనే? వాళ్ళు వాళ్ళే? అసలు అసలే! నకలు నకలే! అసలు బలం నా కోటులో ఉందిరా! అందుకేగా నా కోటు కొట్టెయ్యాలని చూస్తున్నారు మీరందరూ?

ఎన్ని గుండెలు మీకు నా కోటును నానుంచి దూరం చెయ్యడానికి!

ఆరోజు గణపతిరావుకు తలుపు తాళం తీస్తుంటే అంతకుముందే మారు తాళంతో ఎవరో లోపల ప్రవేశించి కూర్చున్నారనిపించింది. జంకుతూనే తలుపు తెరిచాడు. లోపలకు తొంగి చూశాడు. ఎవరూ కనిపించలేదు. లోపలి కెళ్ళి మంచంకింద చూశాడు. తలుపు చాటున చూశాడు. ఎవరూ లేరు.

కోటుతీసి బాత్‌రూంలోకి వెళ్ళాడు. ముఖం కడుక్కుంటుంటే వెంటిలేటర్‌లోనుంచి ఎవరో తొంగి చూసి

నట్టుగా అన్పించింది. కళ్లు తెరిచాడు. సబ్బునీళ్ళు కళ్ళల్లోకి పోయి కళ్ళు మండసాగాయి. గబగబా ముఖం కడుక్కొని గదిలోకి వచ్చి ముఖం తుడుచుకున్నాడు. కోటు కేసి చూశాడు. అది గోడమీద మేకుకు లేదు. తృళ్ళిపడ్డాడు. కుర్చీ మీద ఉంది. ఇదేమిటి? ఇది ఇక్కడెలా ఉంది? ఎవరో తన కోటు తీసుకెళ్ళే ప్రయత్నంలో లోపలకు వచ్చారు. తను వస్తున్నట్లు పసిగట్టి కోటు కుర్చీమీద పడేసి పారిపోయారు.

గణపతిరావు కోటు వేసుకొన్నాడు. ఆ రాత్రి కోటు తియ్యకుండానే పడుకున్నాడు. ఎవరో గదిముందు తిరుగుతున్నట్లు అలికిడి విన్పించింది.

ఇంకెవరు? ఆ అదిత్యగాడే? ఆఫీసువాళ్ళే వాడిని ఈ పనికి పురమాయించి ఉంటారు. బాగా డబ్బు తినబెట్టి ఉంటారు. తన బుర్ర చాలా క్విక్‌గా పనిచేస్తున్నది. వెంటనే వాళ్ళ కుట్రను తెలుసుకోగలిగాడు.

మరో వెర్రి వెంగళాయిగాడైతే కోటు ఈపాటికి చెయ్యి జారిపోయేదే? తన తెలివితేటలవల్లే తన కోటు ఇంకా తన దగ్గిర ఉంది.

గణపతిరావుకు కోటు పోతుందనే భయం ఎక్కువైంది.

బయటికి రావాలంటే భయం పట్టుకుంది. కొద్ది రోజులుగా ఆఫీసుకు కూడా వెళ్ళడం లేదు.

ఆ రోజు ఆఫీసుకు బయలుదేరాడు.

"ఇవాళ తప్పదు. యుద్ధం తప్పదు. డిష్యుం డిష్యుం తప్పదు. నేనూ అందుకు సిద్ధంగానే ఉన్నాను. రండ్రా ఎవరొస్తారో? నేను రెడీ!"

ఆలోచిస్తూ ఆఫీసులోకి అడుగు పెట్టాడు. అతడి వాలకం చూసి నిజంగానే అందరూ భయపడిపోయారు. జుట్టు రేగివుంది. కళ్ళు ఎర్రగా జ్యోతుల్లాగా ఉన్నాయ్. ముఖం కూడా ఎర్రగా కందగడ్డలా ఉంది.

"ఏమయ్యా గణపతీ! ఏమైపోయావ్? లీవ్ లెటర్ కూడా లేదు. ఒంట్లో బాగాలేదా! ఇవ్వాళ సాయంత్రం నేనూ శేఖరం వచ్చి చూద్దామనుకున్నాం" సూపరెంటెంటు అతడి కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు.

"రాస్కెల్స్! రోగ్స్! ఇంటికొచ్చైకూడా రావాలను కొన్నారా? ఎందుకూ! నా కోటు కొట్టెయ్యడానికేగా? ఆ మాత్రం నాకు తెలియదేమిటి"

అందరూ బిత్తరబోయి బిగిసిపోయారు.

"ఏడేడు సముద్రాలు—అవి దాటాక ఒక కీకారణ్యం— కాకులు దూరని కారడవి చీమలు దూరని చిట్టడవి—ఆ అడవి మధ్యలో ఓ మర్రిచెట్టు— ఆ చెట్టు చుట్టూ పాములూ— మండ్రగబ్బలూ— భూత ప్రేత పిశాచాలూ కాపలా కాస్తుంటాయి. ఆ చెట్టుకో తొర్ర— ఆ తొర్రలో ఒక రామ

చిలక– ఆ చిలక మెడలో మా ం త్రి కు డి ప్రాణం-" ఆపి విరగబడి నవ్వాడు. నవ్వుతూ నవ్వుతూ ఎవరో మీట నొక్కినట్టు ఠక్కున ఆగాడు– మళ్ళీ అందుకున్నాడు. "వాడి ప్రాణాలు చిలక మెడలో– తోలు కోటులో-"

'గణపతీ! గణపతీ! ఏమిటలా మాట్లాడుతున్నావ్? ఇటుచూడు–' శేఖరం కంఠం వణికింది.

'ఏమిటలా చూస్తారు? బోడి వెధవాయిల్లారా! నాకు తెలుసురా మీ ఎత్తులు? రాస్కెల్స్ నాకంతా తెలుసు– నేనంటే మీకు భయం. నా కోటులోనే నా బలం ఉందని తెలిసి ఆ కోటు కొట్టెయ్యాలని చూస్తున్నారు' గలగల నవ్వ సాగాడు. అతడి నవ్వు చెడిపోయిన టేబుల్ ఫాన్‌ను ఆన్ చేస్తే వచ్చే శబ్దంలా ఉంది.

సూపర్నెంటు లేచి ఖంగారుగా ఆఫీసరు గదిలోకి పరుగుతీశాడు.

'ఒరేరే! ఎందుకురా పరిగెత్తుతున్నావ్? గోచి– గోచి ఊడింది' చప్పట్లు కొట్టాడు గణపతిరావు.

ఆఫీసరు సూపర్నెంటు వెనకే సెక్షన్‌లోకి వచ్చాడు.

అందరూ అతణ్ని చూసి లేచి నిల్చున్నారు.

గణపతిరావు లేవలేదు.

కాళ్ళూపుతూ, తలెత్తి ఆఫీసర్ని నిర్లక్ష్యంగా చూశాడు.

"గణపతీ!" ఆఫీసరు గణపతి సీటు దగ్గరకొచ్చి పిల్చాడు.

గణపతి బిగిసిపోయి కూర్చున్నాడు. పెదవులు రెండూ బిగబట్టాడు.

'గణపతీ ఇలా చూడు!' ఆఫీసరు కంఠం ఆర్ద్రంగా పలికింది.

'ఏం? ఎందుకు చూడాలి? నువ్వేం నలకూబరుడివా? మన్మధుడివా? ఏం చూడమంటావ్. నీ అందా న్నా!' విరగబడి నవ్వసాగాడు గణపతి.

ఆఫీసరు రెండడుగులు వెనక్కు వేశాడుఅ ప్రయత్నంగానే. ఓ క్షణం అతడి ముఖంలోకి చూసి 'షణ్ముగం! రా!' అని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

సూపర్నెంటు షణ్ముగం అతన్ని అనుసరించాడు.

'వెళ్ళిపోయాడు నాయాల. భయపడిపోయారు. వాడూ మీతో చేతులు కలిపాడుకదూ? నాకు అన్నీ తెలుసురా! రండిరా ఎవరొస్తారో?' అంటూ చివ్వున లేచి బల్లమీద నిలబడ్డాడు.

టైపిస్టు నాగమణి చేతివేళ్ళు మిషను మీద బిగుసుకు పోయాయి. నాలుక తడారిపోయింది.

గణపతిరావు ఏదేదో అంటున్నాడు. గాల్లోకి చేతులు విసురుతున్నాడు. ఒక్క సారిగా బల్లమీద నుంచి కిందకు దూకాడు.

గణపతిరావుకు అంతవరకూ హీరోగా ఉన్న తను ఒక్కసారిగా విలన్‌గా మారిపోయినట్టుగా అన్పించింది.

మోహన్‌బాబు అయిపోయి అంతలోకే గబ్బర్‌సింగ్‌గా మారిపోయినట్టుగా అన్పించింది.

నోట్లో ఏదో ఉన్నట్టు నములుతున్నాడు. గవద ఎముకలు కిందకూ పైకీ కదుల్తున్నాయ్.

"రండ్రా! రండి! పిరికి సన్నాసుల్లారా! రండి!" అరుస్తున్నాడు.

ఇద్దరు ఎలెండర్లు వచ్చి అతడి చెరో రెక్క పట్టుకున్నారు. లెదర్ కోటువల్ల వాళ్ళకు పట్టుచిక్కలేదు. పట్టుకుంటే జారిపోతున్నాడు.

గణపతిరావు సినిమాల్లోని విలన్‌లా ఎగుర్తూ పిడికిలి బిగించి ఒకడి ముక్కుమీద గుద్దాడు. రెండోవాడి పొట్టలో తన్నాడు. ఇద్దరూ అరుస్తూ పరుగు తీశారు.

ఆ కేకలకు పక్క సెక్షన్ వాళ్ళు వచ్చారు.

"ఊ! రండిరా! రండి!" అచ్చం సినిమాల్లోలాగే ఫైటింగ్ చేస్తున్నట్టు గంతులేస్తున్నాడు. చేతులు విసురుతున్నాడు.

"డిష్యూం! డిష్యూం! ఆడపడుచూ! నాగమణీ! నువ్వేం భయపడకు చెల్లీ!"

నాగమణి లేచి పారిపోయింది.

ఆఫీసరు వచ్చి గది గడప దగ్గర నిల్చున్నాడు.

"ఏరా! నీకూ ఒకటి వేడి వేడిగా వడ్డించనా?" అంటూ ఆఫీసరు వైపు నడిచాడు.

అందరూ అతడిమీదపడి పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ముందుకి పోకుండా అడ్డుపడ్తున్నారు.

'నీకేం కర్మరా! నీకూ నా కోటే కావాలొచ్చిందా? పందిలా బలిసి ఉన్నావ్?' తనను పట్టుకొన్నవాళ్ళతో పెనుగులాడుతూనే. ఆఫీసర్ని చూస్తూ అన్నాడు గణపతిరావు.

'ఆ కోటు లాగెయ్యండి' సైకాలజీ ఎం. ఏ. చదివిన రాజేంద్ర అన్నాడు.

కోటు లాగేస్తుంటే అరుస్తూ పెనుగులాడుతున్నాడు.

కోటు లాగేశారు. ఆ చేతినుంచి ఆ చేతికి దూరంగా వెళ్ళిపోయింది కోటు.

గణపతిరావు ఒక్కసారి గాలితీసేసిన టైరులా చప్పబడి చతికిలబడిపోయాడు. పట్టుకొన్న వాళ్ళ చేతుల్లో జవజవలాడి జారిపోయాడు.

"నాకోటు! నాకోటు!" భోరున ఏడ్వసాగాడు గణపతిరావు.

'ఇస్తాంలే. నీ కోటు మాకెందుకు? అల్లరి చెయ్యకు'

'ఏడ్వకు, ఇటుచూడు గణపతీ!'

'నాకోటు కొట్టేశారు. మీరు కుక్కలూ—పందులు—రోగ్స్—' అరుస్తున్నాడు. ఏడుస్తున్నాడు.

అతడ్ని బలవంతంగా వ్యాన్ ఎక్కించారు.

నలుగురైదుగురు అతడిని పట్టుకొని వ్యాన్‌లో కూర్చున్నారు. అతని కండల్లేని ఎముకల్ని పట్టుకొని వాళ్ళ చేతులు ఒరుచుకుపోతున్నాయి.

వ్యాన్ కదిలింది.

ఆఫీసువాళ్ళంతా కదిలిపోతున్న వ్యాన్‌ను జాలిగా చూస్తూ నిలబడ్డారు.

ఎర్రగడ్డకేసి వ్యాన్ పోతున్నది.

'నా కోటు— నా కోటు—' ఓపిక లేనట్టుగా చిన్నగా అంటున్నాడు గణపతిరావు.

వ్యాన్ మానసిక ఆరోగ్య ఆసుపత్రిలోకి ప్రవేశించింది.

ఇద్దరు వార్డర్లు చెరో రెక్కా పట్టుకొని లాక్కెడుతున్నారు.

"నా కోటు నా కోటు" అరుస్తూనే ఉన్నాడు.

అతడివెంట ఆఫీసువాళ్ళు కూడా నడుస్తున్నారు.

"డాక్టరుగారు ఇటే వస్తున్నారు" అన్నాడు ఒక వార్డరు.

చాలా పొడవుగా, సన్నగా, తెల్ల కోటుతో ఊగుతున్నట్టు నడుస్తున్నాడు డాక్టర్. అతడి పక్కనే బ్లూ చీర మీద తెల్లకోటు వేసుకొన్న మరో లేడీ డాక్టర్ నడుస్తోంది.

ఆమె నల్లగా ఉంది. లావుగా ఉంది. చెవులు పక్కగా చెంపలమీద నల్లటి జుట్టు. పళ్ళెత్తు. ఆ పక్కనే తెల్ల పావురంలా, శాంతి దూతలా ఓ నర్సు...

"ఏమైంది ?"

తనకు తెలిసినంతవరకు శేఖరం చెప్పాడు. తోలు కోటు వేసుకుంటున్నప్పట్నుంచీ అతడిలో వచ్చిన మార్పు గురించి చెప్పాడు.

డాక్టరు అదోలా నవ్వాడు కేసు చూడగానే అర్థం అయినట్టు.

'పర్వాలేదు త్వరలోనే తగ్గిపోతుంది. జెస్ట్ ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్' అన్నాడు డాక్టర్.

లేడీ డాక్టరు చివ్వున తలతిప్పి చూసింది.

"ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు ఉన్నా..."

"అందరికీ రాదు" అన్నాడు లేడీ డాక్టర్ మాటల్ని మధ్యలోనే అందుకుని.

ఓ క్షణం ఆగి డాక్టర్ మళ్ళీ అన్నాడు. 'ఆ కాంప్లెక్సు దాదాపు నూటికి తొంభయ్‌మందిలో ఉంటుంది. కాని అది మోతాదు దాటినప్పుడే!'

'రాగాన పడుతుండంటారు?' అని ఆ నల్లటి ముఖంలో తెల్లటి పళ్ళు కన్పించేలా నవ్వింది లేడీ డాక్టర్.

డాక్టర్ కూడా చిరునవ్వు నవ్వాడు.

నర్సు నవ్వలేదు. జాలిగా పేషెంటునే చూస్తోంది.

"అతడ్ని విశ్వామిత్ర వార్డులోకి తీసుకెళ్ళండి. నేను వచ్చి చూస్తాను" అని వార్డర్లకు చెప్పి, ఆఫీసు వాళ్ళతో "మీరు నాతో రండి" అంటూ ఆఫీసుకేసి నడక సాగించాడు డాక్టరు.

వార్డర్ని లాక్కెళుతుంటే "నా కోటు నా కోటు" అంటూ కీచుగా అరుస్తున్నాడు.

ఏడుస్తూనే నవ్వుతున్నాడు గణపతిరావు.

అక్కడెక్కడో, ఓ మారుమూల పల్లెలో, ఓ తల్లి గుండెలో ఏదో కలుక్కుమన్నది.

0 0 0